


ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ

ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూ సమీకరణ విధానాన్ని అవలంబించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలో కీలక నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. రాజధాని ప్రాంత పరిధిలోని అన్ని జిల్లాలకూ భూ సమీకరణ విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానమైతే బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ఈ ఆలోచన చేసింది.



2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు

- సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీకు ప్రయోజనం
- భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 2,196 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ భూములను భూ సమీకరణ విధానంలో తీసుకుంటేనే సీఆర్‌డీఏకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే 75 మీటర్ల వెడల్పున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూ సేకరణ విధానంలో అయితే సగటున రూ.3,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే భూ సమీకరణ విధానంలో అయితే అంత భారం ఉండదు. సమీకరణ విధానంలో అయితే రైతులకు ప్రతిగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కల్పించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఎందుకంటే రూ.61 వేల కోట్లతో రాజధాని పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడేళ్లనలో అమరావతి ఒక రూపును సంతరించుకోనుంది. రాజధానిలో వచ్చే బూమ్ కారణంగా రైతులకు భూ సమీకరణ కింద ఇచ్చే ప్యాకేజీకి భారీగా విలువ పెరుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలను చూసినా కూడా రైతులు ఇచ్చే భూముల ధరలకు సమానంగా ప్యాకేజీ వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచటానికి త్వరలో గ్రామసభలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.



భూములు సిద్ధం చేసుకున్నాకే ఐఆర్ఆర్

ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు అవసరమైన 2,196 ఎకరాలను సిద్ధం చేసుకున్నాకే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. భూములను సిద్ధం చేసుకోవటానికి ఏడాది సమయాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాతే రోడ్డు నిర్మాణ పనుల దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. భూ సమీకరణకు ఎవరైనా అంగీకరించకపోతే భూ సేకరణ విధానంలో అయినా వెళ్లాల్సి ఉంటుంది.

ఐఆర్ఆర్‌కు అనుసంధానమయ్యే అమరావతి రోడ్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రాజధానిలోని మొత్తం 27 రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ-1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, ఎన్-4, 7, 8, 9, 10, 11, 12, 13 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే వంటివి అనుసంధానమవుతాయి. ఇవన్నీ కూడా సింహభాగం 50 మీటర్లు, మిగిలినవి 60 మీటర్ల మేర ఉన్నాయి. మొత్తం 1,362.30 ఎకరాల భూములు ఐఆర్ఆర్‌కు అనుసంధానమవుతాయి.

పాత నోటిఫికేషన్ ప్రకారమే..

పాత నోటిఫికేషన్ ప్రకారమే ఐఆర్ఆర్‌ను కొనసాగించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం 96.16 కిలోమీటర్ల పొడవున, 75 మీటర్ల వెడల్పున ఐఆర్ఆర్ ఉంటుంది. ఐఆర్ఆర్‌కు క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న 27 రోడ్లు కూడా పాత మిగతా 6లో..



నిన్న అఖండ.. నేడు విశ్వంభర

పశ్చిమాన సినీ సందడి

- 12న చిరంజీవి 'విశ్వంభర' భక్తిగీతం విడుదలకు సన్నాహాలు

- పరిటాల ఆంజనేయస్వామి ఆలయమే వేదిక
- ఇప్పటికే బాలయ్య అఖండ2 లొకేషన్ల పరిశీలన
- కృష్ణాతీరం, గుడిమెట్ల ప్రాంతంలో బోయపాటి పర్యటన

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : చిత్రసీమకు కేరాఫ్‌గా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా కళకళలాడుతోంది. నిన్నటికి నిన్న బాలయ్య అఖండ-2 సినిమా షూటింగ్ కోసం చందర్లపాడు మండలంలో కృష్ణానది తీరంలో దర్శకుడు బోయపాటి శ్రీను లొకేషన్లు పరిశీలించగా, నేడు పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా పాటను విడుదల చేసేందుకు దర్శకుడు వశిష్ట సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని తొలిగీతాన్ని ఈనెల 12న విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. రాముడిపై సాగే ఈ భక్తిగీతాన్ని పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అయితే బాగుంటుందని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. యూవీ క్రియేషన్స్ పతాకంపై ప్రమోద్, వంశీ, విక్రమ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, త్రిష కథానాయికగా నటిస్తోంది. ఈ భక్తిగీతంలో చిరంజీవితో పాటు మెగా యంగ్‌హీరో సాయిదుర్గాతేజ్ కనిపిస్తారని చెబుతున్నారు. కాగా, బాలకృష్ణ సినిమా కోసం గత జనవరిలో బోయపాటి శ్రీను చందర్లపాడు మండలంలో పర్యటించి, గుడిమెట్ల పరిసరాలను, కృష్ణానదిని పరిశీలించగా, తాజాగా చిరంజీవి పాట విడుదల సన్నాహాల నేపథ్యంలో పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా భవిష్యత్తులో సినిమా సందడితో కళకళలాడనుంది.

విజయవాడ నగరాభివృద్ధికి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పెద్దన్నలా నేనున్నానంటోంది. రూ.500 కోట్ల వ్యయంతో భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధమైంది. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న స్టామ్ వాటర్(వర్షపు నీటి) డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోనుంది. ఆటోనగర్‌తో ముడిపడిన ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.

రూ.500 కోట్లతో బెజవాడ అభివృద్ధి!

భారీ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్‌డీఏ రెడీ

- రూ.150 కోట్ల వ్యయంతో స్టామ్ వాటర్ డ్రెయిన్లు
- రూ.350 కోట్లతో రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం
- మొత్తం ఐదు రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం
- తూర్పు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు మేలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడను పట్టి పీడిస్తున్న వరదనీటి మళ్లింపు కాలువలకు శాశ్వతంగా పరిష్కారం చూపేందుకు సీఆర్‌డీఏ సిద్ధమైంది. విజయవాడ నగరంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి కారణంగా అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు విజయవాడ నగరంలో స్టామ్ వాటర్(వర్షపు నీటి) డ్రెయిన్ల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులు చాలా వరకు పూర్తయినా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యవేక్షణ లేకపోవటం, వాటిని వదిలేయటంతో అసంపూర్తిగానే ఉన్నాయి. విజయవాడలో చిన్న వర్షం పడినా కూడా నగరంలోని రోడ్లపై నీరు నిలిచే పరిస్థితి ఏర్పడింది. కొండల మీద కురిసిన వర్షం నగరంలోని లోతట్టు ప్రాంతాలను జలమయం చేస్తోంది. నగరమంతటా పటిష్టమైన వరద నీటి మళ్లింపు కాలువలు లేకపోవటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది. నగరంలో బ్యాలెన్స్ వరద నీటి మళ్లింపు కాలువలను పూర్తి చేయటానికి సుమారు రూ.150 కోట్లు అవసరమవుతాయని కార్పొరేషన్ అధికారులు అంచనాలు వేశారు. విజయవాడ నగరానికి సంబంధించి రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణ ఇటీవల సమీక్ష జరిపిన సందర్భంలో వరద నీటి కాలువల అంశం చర్చకు వచ్చింది. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అనేక దఫాలుగా మంత్రి దృష్టికి తీసుకురావటం జరిగింది. బ్యాలెన్స్ వరద నీటి మళ్లింపు కాలువల పనులను సీఆర్‌డీఏ ద్వారా చేయించేందుకు మంత్రి నారాయణ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ నగర వ్యాప్తంగా బ్యాలెన్స్ స్టామ్ వాటర్ డ్రెయిన్లను పూర్తి చేసేందుకు రూ.150 కోట్ల నిధులను సీఆర్‌డీఏ ఖర్చు చేయనుంది. బ్యాలెన్స్ స్టామ్ వాటర్ డ్రెయిన్స్‌తో పాటు ఆటోనగర్ గుంటుతిప్ప డ్రెయిన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు.

రూ. 350 కోట్ల వ్యయంతో ఐదు రోడ్ల విస్తరణ

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఆటోనగర్‌తో ముడిపడిన ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా నాలుగు రోడ్ల విస్తరణ పనులు కూడా సీఆర్‌డీఏ చేపట్టబోతోంది. దీని కోసం రూ.350 కోట్ల నిధులను ఖర్చు పెట్టనుంది. ఇప్పటికే విజయవాడ శివారున ఎనికేపాడులో శక్తి కళ్యాణ మండపం రోడ్డును సీఆర్‌డీఏ తన సొంత నిధులతో అభివృద్ధి చేసింది. ఇదే క్రమంలో మరో నాలుగు రోడ్లను సీఆర్‌డీఏ అభివృద్ధి చేయనుంది.

- మహానాడు రోడ్డును మరింత విస్తరించాలని నిర్ణయించారు. మహానాడు రోడ్డు మీదుగా విజయవాడలోకి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ భారీ వాహనాల రాకపోకలను నియంత్రించటం కోసం మహానాడు రోడ్డును నిడమానూరు వరకు పొడిగించి అక్కడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 16కు అనుసంధానించనున్నారు.
- బల్లెం వారి వీధి కొన్ని చోట్ల 40, 50 అడుగులుగా ఉంది. దీనిని 80 అడుగుల రోడ్డుగా విస్తరించనున్నారు. అలాగే ఈ రోడ్డును ఎనికేపాడు వరకు విస్తరించి ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానం చేస్తారు.
- బల్లెం వారి వీధిని శక్తి కళ్యాణ మండపం రోడ్డుకు అనుసంధానిస్తారు. దీని వల్ల బల్లెం వారి వీధి మీదుగా వచ్చే వాహనాలు రామవరప్పాడు రింగ్ దగ్గర కాకుండా ఎనికేపాడు దగ్గర ఎన్‌హెచ్ - 16కు శక్తి కళ్యాణ మండం రోడ్డు నుంచి అనుసంధానమవుతాయి. దీని కోసం ఈ రెండు రోడ్లకు ఎలా కనెక్టివిటీ ఇవ్వాలన్న దానిపై సీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.
- ప్రస్తుతం ఆయుష్ ఆస్పత్రి దగ్గర హైటెన్షన్ లైన్ల కింద అభివృద్ధి చేసిన రోడ్డును నిడమానూరు వరకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. హైటెన్షన్ తీగల కిందుగా ఈ రోడ్డును కొత్తగా ఏర్పాటు చేస్తారు. ఈ రోడ్డుకు భారీగా వ్యయం అవుతుందని సీఆర్‌డీఏ అధికారులు అంచనాలు వేస్తున్నారు.
- ఎనికేపాడు - తాడిగడప రోడ్డును నేరుగా నిడమానూరుకు అనుసంధానం చేయాలని కూడా నిర్ణయించారు. ఈ రోడ్డును నిడమానూరుకు అనుసంధానం చేయటం ద్వారా ఎన్‌హెచ్ - 16కు కనెక్టివిటీని కల్పిస్తారు.

తవ్వేస్తున్నారు..!



పెదపారుపూడి మండలం మోపర్రు వద్ద బుడమేరులో తవ్వకాలు

జిల్లాలో మట్టి, బుసక దందా!

బుడమేరులో మోపర్రు వద్ద జోరుగా మట్టి తవ్వకాలు

జిల్లాలో మట్టి, బసుక మాఫియా దందా జోరుగా సాగుతోంది. బుడమేరులో మోపర్రు వద్ద వందలాది లారీల మట్టిని తవ్వి సమీప ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం కోసం రైతులు ఇచ్చిన వందల ఎకరాల భూముల్లో అక్రమార్కులు బుసక దందాకు తెరలేపారు. యథేచ్ఛగా తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిం చేస్తున్నారు. ఇదేంటి ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. తోట్లవల్లూరు మండలంలో ఏకంగా బందరు కాలువ గట్టుకే ఏసరు పెట్టారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేశారు. వరదలు వస్తే గట్టు తెగిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇంతలా మట్టి, బుసక మాఫియా రెచ్చిపోతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మచిలీపట్నంలోని ముడా భూముల్లో బుసక అక్రమ రవాణా
- తోట్లవల్లూరులో కాలువ గట్టుకు ఎసరు!
- నాగాయలంకలో రాత్రివేళ అక్రమాలు
- ఈ దందాల వెనుక వైసీపీ నాయకుల హస్తం!
- ప్రజల నుంచి ఫిర్యాదులు.. పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గుడివాడ నియోజకవర్గంలోని పెదపారుపూడి మండలం మోపర్రు సమీపంలో బుడమేరు గట్టును ఇష్టారాజ్యంగా తవ్వి వందలాది టిప్పర్ల మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఉంగుటూరు. గన్నవరం, గండిగుంట, ఉయ్యూరు తదితర ప్రాంతాలకు ఈ మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అధికారులు హడావుడి చేస్తే ఒక రోజు పనులు నిలిపివేసి, మరుసటి రోజు నుంచే యథావిధిగా మట్టిని తరలించేస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఏకంగా కాలువ గట్టునే తవ్వేశారు..

తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు-చినపులిపాక గ్రామాల మధ్య బందరు కాలువ గట్టును తవ్వేసి మట్టిని ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాలకు తరలించేశారు. కాలువ గట్టును ఆక్రమించి మట్టిని తవ్వేస్తున్నా నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకోలేదు. వర్షాకాలంలో కాలువకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తే కాలువగట్టు తెగిపోతుందని రైతులు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలువ గట్టును బలోపేతం చేస్తామని చెప్పి ఆశాఖ అధికారులు ఈ విషయాన్ని మరుగున పెట్టేశారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఈ మట్టి, బుసక దందాల వెనుక వైసీపీ నాయకులు హస్తం ఉన్నట్లు సమాచారం.

ముడా భూముల్లో బుసక తవ్వకాలు

మచిలీపట్న మండలంలోని కరగ్రహారం, గోపువానిపాలెం, గిలకలదిండి, తపశిపూడి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల నుంచి బుసకను అక్రమంగా తరలించేస్తున్నారు. పోర్టు నిర్మాణం కోసం రైతులు మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కి 600 ఎకరాలు విక్రయించారు. ఆ భూముల్లో బుసక తవ్వకాలు చేపట్టారు. కరగ్రహారం, తదితర గ్రామాల నుంచి పోతేపల్లి సమీపంలో జాతీయ రహదారి సమీపంలో ఒక జూనియర్ కళాశాల పక్కనే ఉన్న 15 ఎకరాల భూమిని మెరక చేసేందుకు ఇటీవల కాలంలో ఐదు వేల ట్రాక్టర్ల మిగతా 6లో..

మొక్కుబడి చర్యలతో సరి..

నాగాయలంక మండలంలో బుసక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వక్కపట్లవారిపాలెం, దిండి, గుల్లలమోద గ్రామాల్లో రాత్రి సమయంలో మట్టిని తవ్వి అక్రమంగా తరలించేస్తున్నారు. మొక్కుబడిగా రెండు, మూడు సార్లుగా జేసీబీలను పోలీసులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులకు ఈ వాహనాలను అప్పగిస్తే.. నామమాత్రపు జరిమానా విధించి సరిపెట్టేశారు. మళ్లీ ఈ గ్రామాల్లో మట్టి రవాణాను కొసాగిస్తూనే ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై చక చకా..

- దుర్గగుడిపై శరవేగంగా నిర్మాణ పనులు
- భక్తులకు వసతుల కల్పనపై అధికారుల దృష్టి
- మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త డిజైన్లు
- ఊపందుకున్న నూతన భవన సముదాయాలు
- ఏడాదిలో భక్తులకు అందుబాటులోకి..!
- మరింత సౌకర్యవంతంగా దుర్గమ్మ దర్శనం 6లో



7 లక్షల మందిపై భారం

- గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50 పెంచిన కేంద్రం
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏడు లక్షల కనెక్షన్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్యాస్ వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపింది. సిలిండర్‌పై రూ.50 పెంచింది. ఫలితంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఏడు లక్షల మంది వినియోగదారులపై ప్రత్యక్షంగా భారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా 70కి పైగా గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు ఏడు లక్షల వరకు డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్‌కు రూ.50 లెక్కన చూస్తే ప్రతి రెండు నెలలకు రూ.3.50 కోట్ల మేర వినియోగదారులపై అదనంగా భారం పడుతోంది. రెండు నెలలకు ఒక గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి ఆరు సిలిండర్ల ప్రాతిపదికన చూస్తే రూ. 21 కోట్ల భారం ప్రజలపై పడనుంది.

మండలానికి 3, 4 ఆదర్శ పాఠశాలలు

- కలెక్టర్ డీకే బాలాజీ 8లో

కేంద్ర పథకాలను ప్రజలకు చేరువచేయాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ 8లో

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం 6లో

చంద్ర స్ఫూర్తితో హక్కులు సాధిద్దాం : సీపీఐ 8లో



వెండి రథం ఊరేగింపు ప్రారంభిస్తున్న దేవస్థాన స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకస్వాములు, అధికారులు

వెండిరథంపై ఊరేగిన ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణోత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం ఆది దంపతులు వెండిరథంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకస్వాములు ఉదయం 8 గంటల నుంచి మూల మంత్ర హవనములు.. సాయంత్రం ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ వాహనసేవల్లో భాగంగా సాయంత్రం 5 గంటలకు దుర్గాఘాట్ దిగువన ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గామల్లేశ్వరుల వెండి రథోత్సవాన్ని దేవస్థానం స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, వేద పండితులు, అర్చకస్వాములు, అధికారులు ప్రారంభించారు. సంప్రదాయ కళలైన తప్పెట్లు, కోలాట నృత్యాలు, తాళం భజన కళాకారుల ప్రదర్శనలు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గామల్లేశ్వరుల వెండి రథోత్సవం కొనసాగింది. కనకదుర్గానగర్, కుమ్మరిపాలెం సెంటర్, కామకోటినగర్, శంకర మఠం, విద్యాధరపురం, సొరంగం, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా దేవస్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున హారతులు ఇచ్చి టెంకాయలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఆలయ ఏఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.





పదోతరగతి మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు బిషప్ అజరయ్య హైస్కూల్‌లో నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. బుధవారంతో క్యాంపు ప్రశాంతంగా ముగిసిందని, క్యాంపులో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం లేడీయాంప్థిల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 3నుంచి నిర్వహిస్తున్న 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ బుధవారం ముగిసింది. డీఈవో రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజులు ఈ సందర్భంగా ఉపాధ్యాయుల నుంచి టీఏ, డీఏ, ఎన్యూమరేషన్ బిల్లులు తీసుకున్నారు. స్పాట్ వాల్యుయేషన్‌లో చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ చీఫ్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లుగా పనిచేసిన వారందరి బ్యాంకు ఎకౌంట్‌లో ఎన్యూమరేషన్ జమ అవుతుందని డీఈవో తెలిపారు.

ఏఎంసీ చైర్మన్‌గా అన్నే

» వైస్ చైర్మన్‌గా కళ్యాణి.. సభ్యుల జాబితా విడుదల



చైర్మన్ అన్నే

కంకిపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు సభ్యుల జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఇప్పటికే చైర్మన్‌గా ఉప్పలూరు గ్రామానికి చెందిన అన్నే ధనరామకోటేశ్వరరావు పేరును ప్రకటించగా బుధవారం వైస్ చైర్మన్‌తో పాటు కార్యవర్గాన్ని ప్రకటించారు. చైర్మన్‌గా అన్నే ధనరామకోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా మల్లెంపల్లి కళ్యాణి, కార్యవర్గ సభ్యులుగా గోగినేని వెంకటరమణ (కంకిపాడు), సుంకర శ్రీదేవి (ఈడుపుగల్లు), బడుగు సాంబశివరావు(వణుకూరు), బుక్యా బిచాలి (యనమలకుదురు), దండమూడి లక్ష్మీకుమారి (తెన్నేరు), కిలారు శ్రీనివాసరావు (పెనమలూరు), కుంపటి రమేష్‌బాబు (గొడవర్రు), పలగాని సుజాత (ప్రొద్దుటూరు), పి.రజిని (యనమలకుదురు), షేక్ మాబుబ్ సుభాని (గోసాల), సింహాద్రి కృష్ణవేణి (చోడవరం), జనసేన పార్టీ నుంచి గుడివాడ సామ్రాజ్యం (కంకిపాడు), వడ్డీ జీవరత్నం (పెనమలూరు)లను డైరెక్టర్లుగా నియమించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రజక కులానికి చెందిన మహిళ మల్లెంపల్లి కళ్యాణికు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించటంతో పార్టీ క్యాడర్‌లో జోష్ నెలకొంది. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ, పార్టీకి తమ కుటుంబం కట్టుబడి ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సీనియర్ నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, తుమ్మల జగదీష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



హనుమాన్ జంక్షన్‌లో ఫిర్యాదు చేస్తున్న పాల సంఘాల అధ్యక్షులు

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై

తక్షణ చర్యలు తీసుకోండి

» పోలీసులకు కృష్ణా మిల్క్ సంఘాల ఫిర్యాదులు

చిట్టినగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విలువలతో విజయపథంలో దూసుకెళ్తున్న కృష్ణామిల్క్ యూనియన్, చైర్మన్, పాలకవర్గం, ఉద్యోగులపై వీడియో పోస్టింగులతో దుష్ప్రచారాలు చేస్తున్న ప్రమీల, ఆమెకు సహకరించిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన పలువురు పాలక సంఘాల అధ్యక్షులు బుధవారం వేర్వేరు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగుల భద్రత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ కృష్ణా మిల్క్ యూనియన్ ముందుకు దూసుకెళ్తుందని, అటువంటి యూనియన్‌పై సోషల్ మీడియా గ్రూప్‌లలో అసత్య వీడియోల సంబంధించి సత్వరం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. యూనియన్ ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న దుష్టశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పామర్రు, పెడన, బంటుమిల్లి, హనుమాన్‌జంక్షన్, ఆగిరిపల్లి, నందిగామ, చిల్లకల్లు తదితర స్టేషన్‌లో పాల సంఘాల అధ్యక్షులు స్థానిక పాడి రైతులతో కలిసి ఫిర్యాదు చేశారు.



అభివృద్ధి చక చకా..

ఆంధ్రజ్యోతి విజిట్

» ఇంద్రకీలాద్రిపై శరవేగంగా నిర్మాణ పనులు
» భక్తులకు వసతుల కల్పనపై అధికారుల దృష్టి
» మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త డిజైన్లు
» ఊపందుకున్న నూతన భవన సముదాయాలు
» ఏడాదిలో భక్తులకు అందుబాటులోకి..!
» మరింత సౌకర్యవంతంగా దుర్గమ్మ దర్శనం



మహామండపం ఎదురుగా లడ్డూ పోటు భవన సముదాయం

(ఇంద్రకీలాద్రి-ఆంధ్రజ్యోతి)

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మందగించిన పనులు కూటమి ప్రభుత్వం రాకతో ఊపందుకున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవదాయశాఖ అధికారులు మాస్టర్ ప్లాన్ ప్రకారం డిజైన్‌లను రూపొందించి ఆ ప్రకారం పూర్తి చేస్తున్నారు. భవిష్యత్తులో భక్తుల రద్దీ దృష్ట్యా లోటు పాట్లు లేకుండా అన్ని వసతులను కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం



ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడకుండా ఏర్పాటు చేసిన ఐరన్ మెష్

ఆరు అంతస్థులతో లడ్డూపోటు

లడ్డూపోటుకు రూ.27కోట్లు అంచనాతో ఆరుఅంతస్థుల భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగు అంతస్తుల శ్లాబు పూర్తికాగా.. మరో మూడు నెలల్లో మిగతా రెండు అంతస్తులు పూర్తి కానున్నాయి. వంటశాల, లడ్డూ, పులిహోర తయారీ, ప్యాకింగ్, సరుకులను నిల్వచేసేందుకు స్టోర్, లడ్డూ కౌంటర్లు, క్యూలు, కార్యాలయం తదితర వసతులను సిద్ధం చేస్తున్నారు. కొత్త లడ్డూ పోటు నిర్మాణం పూర్తయితే బుద్దావారి గుడి కళ్యాణమంటపంలో ఉన్న లడ్డూ తయారీ కేంద్రాన్ని ఇక్కడికి మార్పు చేస్తారు.

ఏకకాలంలో 1200 మంది కూర్చునేలా అన్నదాన భవన నిర్మాణం

రూ.26 కోట్లు అంచనాతో మహామండపానికి ముందు రెండంతస్తుల భవన నిర్మాణం చేస్తున్నారు. మొదటి అంతస్తు శ్లాబు పనులు మరో ఆరునెలల్లో పూర్తికానున్నాయి. ఇక్కడ ఏక కాలంలో 1200 మంది భక్తులు భోజనం చేయవచ్చు. అత్యాధునిక వంటశాల, కార్యాలయం, స్టోర్లు ఏర్పాటు చేస్తున్నారు.

● కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు తారు రోడ్డు నిర్మిస్తున్నారు. గతంలో వేసిన రోడ్డు పూర్తిగా పాడవడంతో మరో లేయర్ వేసేందుకు రూ.50లక్షలు కేటాయించి టెండర్లను ఆహ్వానించారు. మరో రెండు నెలల్లో ప్రక్రియ పూర్తఅవుతుంది.

● మహామండపం దక్షిణం వైపున ఉన్న అమ్మవారి పూజా మెట్ల మార్గం ముందు రేకుల షెడ్డు పూర్తిగా పాడవటంతో దానిస్థానంలో టెన్‌సైల్ షెడ్డును నిర్మించనున్నారు. రూ.90లక్షలు అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ మరో మూడు నెలల్లో పూర్తవుతుంది.

● మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.76.33 లక్షల వ్యయంతో నవగ్రహ మండప నిర్మాణం చేశారు. ముహూర్తం చూసి దీనిని వినియోగంలోకి తీసుకురానున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయం చుట్టూ నూతనంగా నిర్మించిన ప్రాకార మండపానికి నాలుగు వైపులా రూ.4లక్షల వ్యయంతో స్టీలు ఫ్రేములను బిగిస్తున్నారు. దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న స్టీలు ఫ్రేములను ఇందుకు వినియోగిస్తారు. మరో పది రోజుల్లో పనులు పూర్తవుతాయి.

● మల్లేశ్వరస్వామి ధ్వజస్తంభానికి రాగి తొడుగు వేసే పనులను పూర్తిచేసి తిరుమల దేవస్థానం నిపుణుల ఆధ్వర్యంలో స్వర్ణ తాపడం చేయించనున్నారు.

● ఆలయ ప్రాంగణంలో రాధాకృష్ణుల బొమ్మ వద్ద రూ.5కోట్లు వ్యయంతో నూతన రాతియాగశాల పనులు పూర్తవుతున్నాయి. సుమారు నెలలో పనులు పూర్తి కానున్నాయి. యాగశాల పూర్తి కాగానే ప్రత్యేక యాగాలు అందుబాటులోకి వస్తాయి.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే పనులు..



– ఈవో రామచంద్ర మోహన్

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అభివృద్ధి పనులు ఈ ఏడాది జనవరి నుంచి శరవేగంగా జరుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం డిజైన్‌లను రూపొందించి పనులు నిర్వహిస్తున్నాం. కనకదుర్గనగర్ నుంచి మహామండపం వరకు క్యూ కాంప్లెక్స్, గతంలో నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాం. ఆరునెలల్లో పనులు పూర్తవుతాయి. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పై అంతస్థులోని క్యూ కాంప్లెక్స్‌కు చేరుకునేందుకు కొత్త నిర్మాణం ద్వారా అవకాశం ఉంటుంది. భక్తులకు మంచినీటి సౌకర్యం, పార్కింగ్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు తదితరాలను ఏర్పాటు చేస్తున్నాం.



పర్యావరణ పరిరక్షణ, సుందరీకరణకు ఘాట్ రోడ్డులో వివిధ రకాల మొక్కలు

● దేవస్థానంలో వివిధ ఆర్జిత సేవలు నిర్వహించేందుకు రూ.6కోట్ల వ్యయంతో పూజా మండపాలు నిర్మాణం చేస్తున్నారు. ఇవి మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయి.

● చిన్న రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓం టర్నింగ్ వద్ద, మహామండపం ఏడో అంతస్తులో భక్తుల సౌకర్యార్థం రూ.2.4కోట్లతో చేపట్టిన షెడ్ల నిర్మాణం చేస్తున్నారు. ఇది నెలలో పూర్తవుతుంది. ఓం టర్నింగ్ మధ్యలో కొండరాళ్లు పడకుండా రూ.4.26 కోట్లతో రక్షణ చర్యలు చేపట్టారు.



రాతి యాగశాల నిర్మాణం

● దేవస్థానంలో పారిశుధ్య మెరుగుకు శాశ్వత చర్యల్లో భాగంగా స్టీల్ డస్ట్‌బిన్‌ల ఏర్పాటుకు టెండర్లు ఖరారయ్యాయి. త్వరలో 50 డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయనున్నారు. స్టీలు బెంచీలు, క్యూలలో తాగునీటి సౌకర్యం, ఘాట్ రోడ్డు, దుర్గాఘాట్‌లో మరుగుదొడ్ల ఏర్పాటు దేవస్థాన బస్సుల్లో సీసీ కెమెరాలు, భక్తులు బస్సులు తిరిగే వేళల బోర్డుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నాయి. ఇంకా అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఘాట్ రోడ్డులో ల్యాండ్ స్కేపింగ్‌తో సహజ సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమం జరుగుతోంది. వేసవి దృష్ట్యా భక్తుల కోసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశారు.



మల్లేశ్వరాలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం

మామిడి రైతుల్ని ఆదుకోండి!

» కౌలు రైతు సంఘం డిమాండ్



రాలిన మామిడికాయలను చూపుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల దెబ్బతిన్న మామిడి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఈదురుగాలులకు దెబ్బతిన్న మామిడి తోటలను ఆయన బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొత్తూరు తాడేపల్లిలో సుమారు 70 శాతం తోటలు దెబ్బతిన్నాయన్నారు. గ్రామంలో 2,700 ఎకరాల్లో 450 ఎకరాలు మామిడి తోటలే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి స్వచ్ఛంద పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో ముగ్గురు రైతులు మాత్రమే తమ తోటలను బీమా చేయించుకోగలిగారన్నారు. మిగిలిన రైతులు ప్రీమియం ఎక్కువని బీమా చేయించుకోలేకపోయారన్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా మామిడి రైతులు నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయశాఖలతో పంట నష్టం అంచనా వేసి వాస్తవంగా కౌలు చేసిన రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈక్రాప్ బుకింగ్‌తో సంబంధం లేకుండా వెబ్‌ల్యాండ్‌లో నమోదుకాని భూముల్లో సాగుచేసిన మామిడితోటలకు కూడా నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కొత్తూరు తాడేపల్లి మామిడి కౌలు రైతులు ముగ్గురాళ్ల నాగేశ్వరరావు, ఇండ్ల లక్ష్మినారాయణ, గరిమెళ్ల రాంబాబు, రావూరి తిరుపతమ్మ, చప్పిడి బాబురావు, ముగ్గురాళ్ల నాగరాజు, ఇస్లావతు సాంబయ్య తదితరులు మాట్లాడుతూ, పంట చేతికి వచ్చే సమయానికి ఈదురు గాలుల వల్ల కాయ రాలిపోయి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.50 వేల నుంచి 70 వేల వరకు కౌలు చెల్లించడమే కాక రూ.50 వేల వరకు వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చిన తర్వాత అప్పులు తీర్చుకుందామంటే అంతా వర్షార్పణమైందని వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి ఉప్పే నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉడత తగలడంతో తెగి న్యూట్రల్‌పై పడిన 11కెవి కండక్టర్

ఉడత చేసిన నష్టం

రూ. 3 లక్షలు!

తోట్లవల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఓ ఉడత విద్యుత్‌శాఖకు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించి ప్రాణాల మీదకు తెచ్చుకుంది. తోట్లవల్లూరులో 37వ నెంబర్ ట్రాన్స్‌పార్మర్ వద్ద స్తంభంపైకి బుధవారం ఉడత ఎక్కింది. ఉడత ఫేస్, న్యూట్రల్‌కి టచ్ కావటంతో 11కేవీ కండక్టర్ తెగి న్యూట్రల్‌పై పడటంతో ఒక్కసారిగా హైవోల్టేజ్ ప్రసరించింది. దీంతో ఉడత కాలిపోయి అక్కడే పడిపోయింది. ట్రాన్స్‌పార్మర్ కింద ఉన్న వినియోగదారుల ఇళ్లల్లో మీటర్లతో పాటు టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. 50 మీటర్లు న్యూట్రల్ నుంచి హైవోల్టేజ్ వచ్చి కాలిపోయాయని మండల విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు బిగిస్తున్నామని, తమ శాఖకు రూ.50 వేలు నష్టం వాటిల్లిందన్నారు. ఎలక్ట్రికల్ గృహోపకరణాలు కాలిపోవటం ద్వారా ప్రజలకు రూ. 2.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ఎంతపని చేశావే ఉడత.. అంటూ స్థానిక ప్రజలు ఉసూరుమంటూ నిట్టూర్చారు.



వాట్సాప్‌లో ధాన్యం విక్రయాలు

» కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఏవిధంగా విక్రయించాలో కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. రైతులు ముందుగా తమ ఫోన్‌లో 7337359375 నెంబరును సేవ్ చేసుకోవాలని, అనంతరం 7337359375కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెట్టాలని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు స్వాగతం. ధాన్యం అమ్మడానికి షెడ్యూల్ చేసుకోండి' అనే మెసేజ్ కనిపిస్తుంది. ఇందులో షెడ్యూల్‌పై క్లిక్ చేయాలని తెలిపారు. 'దయచేసి మీ ఆధార్ సంఖ్యను నమోదు చేయండి' అనే మెసేజ్ వస్తుందని, రైతు తన ఆధార్ నెంబర్‌ను టైప్ చేయాలని, ఆధార్ నెంబరు కలిగిన రైతు పేరు, ధాన్యం అమ్మే కొనుగోలు కేంద్రం పేరు స్ర్కీన్‌పై కనిపిస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంపై క్లిక్ చేయగానే.. ధాన్యం అమ్మే తేదీని ఎంచుకోండి అనే మెసేజ్ కనిపిస్తుందని, మీకు నచ్చితే తేదీపై క్లిక్ చేయాలని, అనంతరం ధాన్యం అమ్మే సమయాన్ని ఎంచుకోవాలని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మూడు స్లాట్‌లు వుంటాయిన తెలిపారు. ఇందులో ఉదాహరణకు ఉదయం 8 నుంచి 10 గంటల స్లాట్ ఎంచుకొంటే...ఇందులో 8, 9, 10 గంటల స్లాట్ ఏదో ఒక సమయాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. సమయాన్ని ఎంచుకొన్న తర్వాత రైతే ఏ ధాన్యం అమ్ముతున్నారో తెలపాలని కలెక్టర్ పేర్కొన్నారు. కామన్ సార్‌టెక్స్, కామన్ నాన్ సార్‌టెక్స్ ఇలా మీ ప్రాంతానికి సంబంధించిన రకాలు కనిపిస్తాయని, రైతు ప్రభుత్వానికి అమ్మదలచిన ధాన్యంను బ్యాగ్స్‌లో తెలపాలని పేర్కొన్నారు. బ్యాగ్‌ల సంఖ్య తెలపగానే రైతు పేరు, ఏ కేంద్రంలో, ఏ తేదీన ఏ స్లాట్‌లో ఏ సమయానికి ఎన్ని బ్యాగ్‌లో ధాన్యం కొనుగోలు వివరాలు డిస్‌ప్లే అవుతాయని వివరించారు. అదేవిధంగా కూపన్ కోడ్ వస్తుందని, ఏఐ వాయిస్ ఓవర్‌తో రైతులను గైడ్ చేస్తూ వాట్సాప్‌లో సులభంగా ధాన్యం కొనుగోలు షెడ్యూల్ చేసేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేసిందని కలెక్టర్ తెలిపారు.

తవ్వేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

మట్టిని తరలించారు. అయినా అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడలేదు. ఇటీవల ట్రాక్టర్ల ద్వారా కూడా బుసకను తరలించడం గమనార్హం. ప్రభుత్వ భూముల్లో నుంచి ఒక్కో ట్రాక్టరులో బుసకను లోడ్ చేసినందుకు రూ.400 తీసుకుని మరీ అక్రమార్కులు విక్రయాలు జరుపుతున్నారు. పోర్టు నిర్మాణం జరిగితే భవిష్యత్తులో అనుబంధ పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించాల్సి ఉంది. ఇప్పటికే పరిశ్రమల స్థాపనకోసం పలు సంస్థల ప్రతినిధులు తమకు భూమిని కేటాయించాలని అధికారులను సంప్రదిస్తున్నారు. గుంతలమయంగా ఉన్న ఈ భూములను చూసి ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవకాశం లేదని పెదవి విరుస్తున్నారు.

రాత్రి వేళ ట్రాక్టర్లలో అక్రమ రవాణా

మచిలీపట్నం మండలంలోని గోపువానిపాలెం, తపశిపూడి గ్రామాల్లోని 134 నుంచి 137 వరకు ఉన్న సర్వే నంబర్లలోని 56 ఎకరాలు, 138 సర్వే నంబరులోని 17 ఎకరాల్లోని బుసకను పూర్తిగా తవ్వేశారు. 139 సర్వే నంబరులోని 112 ఎకరాలను రైతులు పోర్టు నిర్మాణం కోసం ముడాకు ఎకరం భూమిని రూ.25 లక్షల చొప్పున విక్రయించారు. ఈ భూముల్లోని బుసక మొత్తాన్ని అక్రమార్కులు తవ్వి విక్రయించేశారు. 140 నుంచి 144 సర్వే నంబర్లలోని 30 ఎకరాల్లో ఉన్న బుసకను కూడా తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించేశారు. రాత్రి సమయంలో తపశిపూడి, మంగినపూడి, గోపువానిపాలెం గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా బుసకను తరలించేస్తున్నారు. ముడా అధికారులు ఈ వివరాలన్నింటినీ సేకరించి జాతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు, కలెక్టర్‌కు ఆధారాలతో సహా.. మూడు గ్రామాల ప్రజలతో సంతకాలు చేయించి మరీ నివేదికలు సమర్పించారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యల్లేవు. వివిధ గ్రామాలకు సముద్రం నుంచి ప్రమాదం పొంచి ఉందని ప్రజల నుంచి ఒత్తిడి వస్తోందని ఒక ప్రజాప్రతినిధి బుసక రవాణాను నిలిపివేయాలని చెప్పినందుకుగాను బుసక రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి రాత్రి సమయంలో సదరు ప్రజాప్రతినిధికి ఫోన్‌చేసి బెదిరింపు ధోరణితో మాట్లాడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ

(5వ పేజీ తరువాయి)

అలైన్‌మెంట్ ప్రకారమే అనుసంధానమవుతాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 11 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లపరిధిలో ఐఆర్ఆర్ వస్తుంది. మొత్తం 42 గ్రామాల మీదుగా సాగుతుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, వెలగలేరు, రామచంద్రాపురం, వెదురుపావులూరు, సావారిగూడెం, నున్న, పాతపాడు, నిడమానూరు, పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ సాగుతుంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

కార్పొరేషన్ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు



ఉంగుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఇతర కులాల కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు బుధవారం ముగిశాయి. రెండవరోజు 12 గ్రామాలకు చెందిన 256 మంది దరఖాస్తుదారుల్లో 221మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు తెలిపారు. మొత్తం 27 గ్రామాల నుంచి 462 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వీఎస్ ప్రకాష్‌నాథ్, జూనియర్ అసిస్టెంట్ బి.రత్నశేఖర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కోడి పందేలు!

- వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నిర్వాహకుడి ఆధ్వర్యంలో రాత్రివేళ పందేలు
- పొరుగు జిల్లాల నుంచి వస్తున్న పందెంరాయుళ్లు
- చేతులు మారుతున్న రూ. లక్షలు
- కన్నెత్తి చూడని పోలీసులు



(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు మండలం కాటూరు, పరిసర గ్రామాల్లో అర్ధరాత్రులు కోడి పందేలు యథేచ్ఛగా జరుగుతుండగా లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్టు సమాచారం. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కాటూరు పక్క గ్రామానికి చెందిన ఓ స్థానిక ప్రజాప్రతినిధికి అనుచరుడిగా ఉండి అన్నీ తానై కోడిపందేలు పెద్దయెత్తున నిర్వహించిన కాటూరుకు చెందిన పందేల నిర్వాహకుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ పంచన చేరాడు. సంక్రాంతి సమయంలో గ్రామానికి చెందిన చోటా మోటా నాయకులతో కలసి మాగాణి పొలాల్లో పెద్దయెత్తున బరులు ఏర్పాటు చేశాడు. తనకు పరిచయమున్న ఇతర జిల్లాల్లోని కోడిపందేల రాయుళ్లను రప్పించి రాత్రిపగలు తేడాలేకుండా పందేలతో పాటు జూదం, చిన్న, పెద్ద బజార్ వంటివి మూడు రోజుల పాటు యథేచ్ఛగా నిర్వహించాడు. పండుగ తరువాత అప్పుడప్పుడు తన పాత మిత్రులను పిలిపించి పందేలు వేస్తూ కాలక్షేపం చేస్తున్నట్టు తెలియవచ్చింది. కొద్ది రోజులుగా స్పీడు పెంచి తరచూ రాత్రివేళ లక్షల్లో పందేలు వేస్తున్నట్టు సమాచారం. పోలీసులు రాకుండా వారికి పెద్ద మొత్తంలో దక్షిణం సమర్పిస్తున్నట్టు తెలిసింది. కోడి పందేల నిర్వహణలో అందెవేసిన చెయ్యిగా పేరు గాంచిన నిర్వాహకుడు ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన వ్యక్తిగా ఉండటం వల్ల పోలీసులు కూడా చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పెనమలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పలువురు వ్యక్తులకు షుమారు పదమూడున్నర లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పోరంకికి చెందిన ఉప్పులూరు మహాలక్ష్మికి1.9లక్షలు, ఓబిలిశెట్టి వెంకటసుభాష్‌కు రూ.5 లక్షలు, బొరగంటి శ్రీనివాసరాజుకు రూ. 46వేలు, గోపిన భాస్కర్‌కు లక్షన్నర, ఈడుపుగల్లుకు చెందిన కోనేరు సీతకు రూ. 50వేలు, గంగూరుకు చెందిన హోలికేశ్వర్‌కు లక్షన్నర పెనమలూరుకు చెందిన రత్నకుమారికి రూ. 50వేలు, చిన ఓగిరాలకు చెందిన కొండపల్లి గోపాలరావుకు రూ. 78వేలు, కలవపాములకు చెందిన రాజేశ్వరికి ఏభైరెండువేల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, పీతా గోపీచంద్, ఇబ్రహీం, వడ్లమూడి శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కుల లబ్దిదారులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని ఎమ్మెల్యేకు వినతి

ఆప్కాస్ సంస్థను రద్దు చేయొద్దంటూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు మండల సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసిన సీఐటీయూ నాయకులు ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని, చేసేట్లయితే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మునిసిపాలిటీలో ప్రతి కార్మికుడికి ఆరువేల చొప్పున హెల్త్ అలవెన్సు బకాయి ఉందని, కొద్ది మంది కార్మికులకు సమ్మె కాలంలో జీతాలు ఇవ్వలేదని త్వరలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని బకాయిలు ఇప్పించాలని కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నారాయణ కళాశాలలో వైద్యశిబిరానికి విశేష ఆదరణ

పెనమలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప వందడుగుల రోడ్డులోని నారాయణ శివానీ భవన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష ఆదరణ లభించింది. మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి, ఎండోకేర్ ఆసుపత్రి, క్లోవ్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో షుమారు మూడు వందల మందికి కంటి పరీక్షలు, బీపీ, షుగరు, దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, డీన్ కే శ్రీనివాస్, ఏజీఎం రాజశేఖర్, హెచ్‌ఆర్ రాబిల్లి శివ, ప్రిన్సిపాళ్లు, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడరు పరిధిలో లైన్లు మరమ్మతుల నేపథ్యంలో నేటి ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు గుణదల విద్యుత్‌శాఖ ఈఈ హరిబాబు తెలిపారు. యనమలకుదురులోని బోసుబొమ్మ సెంటరు, సంజీవనగర్, లంబాడీపేట, డబ్బా పంపు రామాలయం, అవనిగడ్డ కట్టఏరియా ప్రాంత వాసులు విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి సహకరించాలని కోరారు.

చెరువులో పడి వివాహిత మృతి

గన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లికి చెందిన వివాహిత ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మి(40) బహిర్భూమికి చెరువు వైపు వెళ్లింది. కాలు జారి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయింది. స్థానికులు చూసి బయటకు తీసే సమయానికే మృతి చెంది ఉంది. గన్నవరం పోలీసులకు సమాచారం ఇవ్వటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రీడా ప్రాంగణం పరిశీలన

గన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రీడాప్రాంగణంలో బాస్కెట్‌బాల్ కోర్టు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని కృష్ణాజిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి ఝాన్సీలక్ష్మీ, ఏఈ ప్రశాంత్ పరిశీలన చేశారు. హెచ్‌ఎం జీవి రవిబాబు క్రీడాప్రాంగణాన్ని చూపించారు. పీడీ డీఎన్ రాజు, రిటైర్డ్ పీడీలు టీఎస్‌ఆర్‌కె ప్రసాద్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

గన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉందని ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఉచిత శిక్షణకు విచ్చేసిన విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ, పదవ తరగతి పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. పేద విద్యార్థులకు అధ్యాపకులతో ఎంట్రన్స్ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు ఆభరణాలు చోరీ

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణించిన గన్నవరానికి చెందిన భీమవరపు సామ్రాజ్యం (64) వద్ద బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్ చోరీ అయినట్లు బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం శ్రీనగర్ కాలనీలో భీమవరపు సామ్రాజ్యం కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె బంధువుతో కలిసి వన్‌టౌన్ శివాలయం వీధిలో బంగారం తాడు కొనుగోలు చేయటానికి బుధవారం మధ్యాహ్నం గన్నవరం గాంధీనగర్ వద్ద విజయవాడ వచ్చేందుకు ఆటో ఎక్కింది. ఆ ఆటోలో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి ఎక్కారు. వారు ముగ్గురు బాధితురాలి పక్కన కూర్చొని రామవరప్పాడు వద్ద ఆటో దిగారు. బాధితురాలు, ఆమె బంధువు అదే ఆటోలో విజయ వాడ కాళేశ్వరరావు మార్కెట్ వద్ద దిగి శివాలయం వీధిలోని ఓ బంగారు షాపు వద్దకు వెళ్లి తన వద్ద భద్రపరచిన మూడు కాసుల బంగారు తాడు, రెండు బంగారు గాజులు, రూ.50వేల నగదు భద్రపరచిన పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటోలో తమతో పాటు ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులే బ్యాగ్‌ను దొంగిలించి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉప్పలమ్మకు ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రత్యేక పూజలు

గన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉప్పలమ్మ తల్లి దీవెనలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు కాసన్నేని రాజా మైలవరం మండలం చంద్రాలలోని తన వ్యవసాయక్షేత్రంలో ఉప్పలమ్మ, ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట చేసి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం అన్నసమారాధన జరిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఉప్పలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ పూజలు చేశారు. తల్లి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, గుజ్జర్లపూడి బాబూరావు, బొమ్మారెడ్డి రాజేష్, దుట్టా శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా రెవెన్యూ సేవలు

ఉయ్యూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సేవలను గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవ ద్వారా నిర్ణీత రుసుం చెల్లించి అర్జీదాఖలు చేసి పొందవచ్చని ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హేలా షారోన్ తెలిపారు. సచివాలయాలు, మీసేవలో చెల్లించిన రుసుముకు రశీదుకు తప్పక అడిగి తీసుకోవాలని, రశీదులో చూపిన మొత్తం కంటే అధికంగా చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

పెనమలూరు : వారసత్వం, కొనుగోలు, గిఫ్ట్, పార్టిషన్ డీడ్‌ల ద్వారా పొందిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి నిర్దిష్ట రుసుములను మించి వసూలు చేసే మీసేవా సెంటర్లు, సచివాలయ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొంటామని తహశీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. మ్యుటేషన్, పాసుపుస్తకాలకు రు.150, భూమి కొలతలకు, ఎఫ్‌లైన్ దరఖాస్తుకు రూ. 550 మాత్రమే చెల్లించాలని లబ్ధిదారులకు సూచించారు. రుసుముల వసూలులో ఎటువంటి ఇబ్బందులున్నా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఉంగుటూరు : ఆన్‌లైన్‌ద్వారా రెవెన్యూ సంబంధిత సర్వీసులు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులనుంచి ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని తహసీల్దార్ జాలాది విమలకుమారి మీసేవా కేంద్రాల నిర్వాహకులు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, రుసుం వసూళ్లలో ఎటువంటి ఇబ్బందులున్నా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

చినఓగిరాలలో ఇండి-గ్యాప్ పొలంబడి

ఉయ్యూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పొలంలో నాటడం నుంచి విత్తనం తయారు చేసుకునే వరకు నిర్ధేశించిన సాగు సూత్రాలు పాటిస్తే ఇండి- గ్యాప్ పొలంబడికి ధ్రువీకరణపత్రం మంజూరు చేయనున్నట్టు ఏపీ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అహ్మద్ అన్నారు. చినఓగిరాలలో బుధవారం విజిటబుల్స్, పల్సెస్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన 15 మంది రైతుల పంట శాంపిల్స్ తీసుకుని 267 ప్యారామీటర్ల పరీక్ష నిమిత్తం బెంగుళూరు పంపిస్తున్నట్టు తెలిపారు. శాంపిల్స్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉంటే ఇండి- గ్యాప్ పొలంబడి ధ్రువీకరణపత్రం ఇస్తామని తద్వారా రైతుకు ఆరోగ్యం, ఆదాయం చేకూరుతుందన్నారు. గన్నవరం ఏడీఏ ఎం సునీల్, ఏఓ నిస్సీగ్రేస్, ఏఈఓ సునీల్‌గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా ఎదిగేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు



ఉంగుటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి ప్రజోపయోగమైన నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయడం ద్వారా భవిష్యత్తులో గొప్ప మార్గదర్శకులుగా ఎదిగేందుకు ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు దోహదపడతాయని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో సీఎస్‌సీ ఫైనలియర్ విద్యార్థులు నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో -2025ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు 72 గ్రూపులుగా ఏర్పడి గేమింగ్, ఐఓటీ, ఎంఎల్‌అండ్‌ఏఐలపై ప్రదర్శించిన ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వి ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, సీఎస్‌సీ విభాగాధిపతి ఎస్‌ఎం రాయ్‌చౌదరి, ఏఐ విభాగాధిపతి కేపీఎన్‌వీ సత్యశ్రీ, కోఆర్డినేటర్లు ప్రవీణ్‌కుమార్, సంధ్య, సాంబశివరావు, భాగ్యశ్రీ తదితరులు ప్రాజెక్ట్ ఎక్స్‌పోను సందర్శించి విద్యార్థులను అభినందించారు.

భూ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు

గన్నవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భూ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం రాజేశ్వరరావు 31వ వర్ధంతిని నిర్వహించి ఆ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమర యోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. రైతాంగ విముక్తి, శ్రామిక ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దేశమే కుటుంబంగా ప్రజలే సర్వసంగా జీవితాన్ని అంకితం చేశారన్నారు. భూస్వాములపై ఎన్నో పోరాటాలు పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. నాయకులు కట్టవరపు విజయరావు, చాగంటిపాటి వెంకటేశ్వరావు, నూతక్కి మోహనరావు, బొడ్డపాటి రాంబాబు, సాదిక్, సతీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పోషకాలు అధికంగా కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ కిరణ్మయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవాణి సూచించారు. వీరవల్లి పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సౌదామని, హెచ్‌వీ మంగతాయారు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పిల్లల సంరక్షణ, ఆరోగ్యపరిరక్షణపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.దుర్గాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉంగుటూరు సచివాలయంలో 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వీరవల్లి పీహెచ్‌సీలో అవగాహన సదస్సు.. ఉంగుటూరు సచివాలయంలో..

కృష్ణానదిలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలోకి దూకి యనమలకుదురు చెందిన మేక దివ్య (29) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది సమాచారం తెలుసుకున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం ఆమెను రక్షించారు.

13న అండర్ -11 చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 13న పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో కృష్ణాజిల్లా అండర్ 11 బాలబాలికల చాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తెలిపారు. ఇందులో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారిని మే లో జరిగే అండర్-11 స్టేట్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తామని, ప్రతి ఏజ్ గ్రూప్‌లో మొదటి రెండు సానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. ఈ టోర్నమెంట్ తో పాటు ఎస్ఆర్ఆర్ ఇన్విటేషన్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరుగుతుందని, ఇందులో టాప్-3లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులుంటాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునేవారు శనివారం సాయంత్రం 6గంటల లోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, వివరాలకు 9700775220, 9247153387 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

గురుకులాల్లోకి ప్రవేశ పరీక్ష 13న

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలు) 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఆదివారం జరుగుతుందని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా సమన్వయ అధికారి ఏ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు హాల్ టిక్కెట్లను హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు హాల్‌టిక్కెట్, ఏదైనా గుర్తింపు కార్డు (ఉదా.ఆధార్‌కార్డు)తో పరీక్షకు హాజరుకావాలన్నారు.

చినయాదరలో మట్టి అక్రమ రవాణా

మచిలీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన యాదర గ్రామంలోని చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న విషయంపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను మెరకచేసే పేరుతో గ్రామంలోని చెరువులో పూడికతీత పనులు చేపట్టారని, వారం రోజులుగా ఈ పనులు జరుగుతున్నట్టు గ్రామస్థులు రెవెన్యూ అధికారులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను మెరకచేయకుండా చిన యాదర గ్రామం సమీపంలోని ఎన్-గొల్లపాలెంలోని ప్రైవేటు స్థలాలను మెరక చేసేందుకు మట్టిని విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టిని రూ.400కు విక్రయిస్తున్నారని, స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ఉండవల్లి, పెనుమాక రైతులకు ప్లాట్లను కేటాయిస్తున్న అధికారులు

ఉండవల్లి, పెనుమాక రైతులకు ప్లాట్లు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన ఉండవల్లి, పెనుమాక గ్రామాలకు చెందిన 33 మంది రైతులకు బుధవారం విజయవాడలోని ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో 101 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 59 నివాస ప్లాట్లు కాగా 42 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా సీఆర్డీయే అధికారులు రైతులకు ప్లాట్లు కేటాయించారు. ఈ- లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రెల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియ చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీయే అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) వసంతరాయుడు మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీపీఎస్ సిబ్బంది, సర్వేయర్లను నియమించామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏజీ చిన్నికృష్ణ, సీఆర్డీయే సిబ్బంది పాల్గొన్నారు.

టెక్  పోలీసింగ్

సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్

నేటి సమాజంలో నేరాల స్వరూపం మారుతున్న తరుణంలో, పోలీసింగ్ విధానాలూ అదే రీతిలో సాంకేతిక పరిజ్ఞానంతో అప్‌డేట్ అవుతున్నాయి. సీసీ కెమెరాలు, డ్రోన్లు, న్యాట్‌గ్రిడ్ వంటి ఆధునిక సాధనాలతో నేరాల విచారణ మరింత సమర్థవంతంగా మారుతోంది. ఎన్టీఆర్ జిల్లా పోలీసు విభాగం ఇందులో ముందంజ వేసి, సాంకేతికతను వినియోగిస్తూ క్రైమ్ కంట్రోల్‌కు మార్గదర్శకంగా నిలుస్తోంది. - ఆంధ్రజ్యోతి, విజయవాడ



న్యాట్‌గ్రిడ్‌తో నిఖార్సయిన సమాచారం

న్యాట్‌గ్రిడ్ (నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్) ద్వారా దేశవ్యాప్తంగా నేరచరిత్ర ఉన్నవారి వివరాలు తెలుసుకోవచ్చు. ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేయడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది.

- సప్త మాసాల్లో సమూల మార్పులు
- శివారు ప్రాంతాల్లో నిఘాకు డ్రోన్లు
- 'పరిధి' చుట్టూ నిఘా నేత్రాలు
- ఆచూకీ లేని నిందితుల కోసం న్యాట్‌గ్రిడ్

డీవీ మానర్ రోడ్డులో ఒక మహిళకు బంధువులతో ఆస్తి వివాదం ఉంది. వివాదాస్పద ఇంటి వద్ద ఆమె బంధువులు చికెన్ పకోడి బండిని పెట్టించారు. అక్కడ చెత్తాచెదారం ఉండడంతో మహిళ వారం క్రితం రాత్రి ఒంటిగంట సమయంలో బయటకు వచ్చి తిట్ల దండకం మొదలుపెట్టింది. అదే సమయంలో ఐదుగురు యువకులు రెండు బైక్‌లపై వెళ్తున్నారు. ఆమె తమను తిట్టుతున్నట్టు అనుమానించిన యువకుల్లో ఇద్దరు బైక్ దిగి ఆమెను కొట్టారు. మిగతా ముగ్గురు ఆపేందుకు ప్రయత్నించినా ఆపలేకపోయారు. బాధితురాలు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. మొదటి కెమెరాలో దాడి జరిగినట్టు కనిపించినా యువకుల ముఖాలు, బైక్ నంబర్లు స్పష్టంగా కనిపించలేదు. రెండో కెమెరా పనిచేయలేదు. మూడో కెమెరాలో ఫుటేజీ చెరిగిపోయింది. చివరికి 4వ కెమెరాలో యువకుల ముఖాలు స్పష్టంగా కనిపించాయి. వెంటనే వారి ఫొటోలను తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా, మరుసటి రోజే వారు వడ్డేశ్వరం ప్రాంతంలోని ఓ కళాశాలకు చెందినవారని తెలిసింది. దీంతో పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కొంతమందికి విచారణకు రాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. నిందితులిచ్చిన చిరునామాలకు వెళ్లినా, బంధువుల ఇళ్లను పరిశీలించినా ఆచూకీ దొరకలేదు. న్యాట్‌గ్రిడ్‌లో వారెంట్లు ఉన్నవారి ఫొటోలను అప్‌లోడ్ చేశారు. కొద్దిరోజులకే వారి ప్రస్తుత చిరునామాల వివరాలు పోలీసులకు అందాయి. ఇలా పలువురికి ఎన్‌బీడబ్ల్యూ జారీ చేసి గుర్తించారు.



పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది మధ్య మొలిచిన చెట్ల కింద పేకాట ఆడుతున్నవారిని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించారు. వీరి చేతుల్లో పేకముక్కలు, మధ్యలో డబ్బులున్న దృశ్యాలు డ్రోన్‌లో నమోదయ్యాయి. వెంటనే ప్రత్యేక బృందం వెళ్లి వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించింది. ఈ ఘటనలన్నీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన కేసులకు ప్రత్యక్ష ఉదాహరణలు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ఎస్వీ రాజశేఖరబాబు పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు తెచ్చారు. కేసు పెద్దదా, చిన్నదా అనే తేడా లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘా

ఇప్పటి వరకు 600కు పైగా కేసులు సీసీ కెమెరాల ఆధారంగా ఛేదించారు. ప్రస్తుతం 15 వేల సీసీ కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటయ్యాయి. వీటిని విజయవాడ ఎంజీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ప్రతి గ్రామంలోనూ కనీసం రెండు నుంచి మూడు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

గగనతలం నుంచి..

ఒక డ్రోన్ పనితీరు 1000 సీసీ కెమెరాలకు సమానమని అధికారులు భావిస్తున్నారు. దసరా ఉత్సవాలు, వరదల సమయంలో డ్రోన్ల ఉపయోగం ప్రభావవంతంగా ఉండటంతో, మొత్తం 28 పోలీస్ స్టేషన్లకు ఒక్కో డ్రోన్ అందజేశారు. 500 మందికి పైగా మహిళా పోలీసులను డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చారు. డ్రోన్లను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు.



ఇటీవల జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డ్రోన్ వివరాలు తెలియజేస్తున్న అధికారులు

చెరగని 'ముద్ర'

కేసు ఏదైనా సరే నిందితులు రిమాండ్‌కు వెళ్తున్నారంటే వారి చరిత్రను మొత్తం పోలీసులు భద్రపరుస్తున్నారు. ఇందులో భాగంగా నిందితుల వేలి ముద్రలు, ఫొటోలను సీసీటీఎన్ఎస్‌లో భద్రపరుస్తున్నారు. ఇప్పటికే ఇంటర్‌సెప్ట్ వాహనాలు, ఈగల్ వాహనాలకు మొబైల్ స్కానింగ్ డివైస్‌లు ఇచ్చారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా ఉన్నవారి వేలిముద్రలు స్కాన్ చేయగానే వారి నేర చరిత్ర బయటపడుతుంది.



వేలిముద్రల స్కాన్..

80 లక్షల ఉపాధి పనిదినాలే లక్ష్యం

- సగటు వేతనం రూ.307 వచ్చేలా అధికారులు కృషి చేయాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో వేతనదారులకు పనికల్పించడంలోనూ, సగటు దినసరి వేతనం రూ.370 వచ్చేలా చూడటంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డ్వామా అధికారులతో కలిసి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బందితో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, వారికి అందుతున్న వేతనం తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. 2025-26కు గాను జిల్లాలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించామని, గతేడాది గణాంకాల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 2,737 పంట కుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, 69 కుంటల నిర్మాణం 100 శాతం పూర్తయిందని, మరో 1,029 పంట కుంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. వేసవిలో పశువులతో పాటు గొర్రెలు, మేకలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికి 277 తొట్టెల పనులు గుర్తించి, పనులు చేపట్టగా, మిగిలిన వాటికి అనుమతుల ప్రక్రియ ఈనెల 12 నాటికి పూర్తిచేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు 2025-26లో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 20ఎకరాలను గుర్తించాలని, జిల్లా లక్ష్యం 4వేల ఎకరాలుగా ఉందన్నారు. డ్వామా పీడీ ఏ రాము, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

చంద్ర స్ఫూర్తితో హక్కులు సాధిద్దాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వన్‌టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ శిఖరం, సుదీర్ఘకాలంపాటు సీపీఐ కేంద్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఏకైక నేత చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితో హక్కులు సాధించుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు నిచ్చారు. బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా విజయవాడ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రామకృష్ణ, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26ఏళ్ల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నేతృత్వం వహించి రాజేశ్వరరావు ప్రత్యేకత చాటుకున్నారన్నారు. ఉమ్మడి ఏపీలో కమ్యూనిస్టు ఉద్యమానికి బీజం వేసింది తొలితరం నేతలు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య అని చెప్పడంలో సందేహం లేదన్నారు. 13 ఏళ్ల మోదీ పాలనలో రాజ్యాంగానికి రక్షణ లేకుండా పోయిందని, లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతుందన్నారు. కమ్యూనిస్టువాదులందరూ సమైక్య పోరాటంతో హక్కులు సాధించుకున్నప్పుడే చంద్ర రాజేశ్వరరావుకు ఘనమైన నివాళులన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర, జిల్లా నేతలు జి.ఈశ్వరయ్య, దోనేపూడి శంకర్, లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, వై.చెంచయ్య, ప్రొఫెసర్ సీ నరసింహారావు, కె.శివారెడ్డి, నాసర్, కె.వి.భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణరావు, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



ఆదర్శ పాఠశాలల ఏర్పాటుపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

మండలానికి 3, 4 ఆదర్శ పాఠశాలలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి మండలంలోను రెండు, మూడు ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం మినీ కాన్ఫరెన్సు హాలులో వివిధ శాఖల అధికారులతో ఆదర్శపాఠశాలల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండటం విదార్థులకు నాణ్యమైన విద్యను అందించగలుగుతామన్నారు. ఆదర్శపాఠశాలల్లో 1, 2 తరగతులు ఆ పాఠశాలల్లోనే కొనసాగుతాయన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై కలెక్టర్ డీఈవో రామారావుతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థుల తల్లితండ్రుల నుంచి అభిప్రాయాలు తీసుకుని ఆదర్శ పాఠశాలలు నెలకొల్పాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నప్పుడు మండల ప్రత్యేకాధికారులను, సచివాలయ సిబ్బంది సాయం తీసుకోవాలన్నారు. ఇటీవల తాను పాఠశాలలను సందర్శించినప్పుడు 5వ తరగతి విద్యార్థులు లెక్కలు సరిగా చేయలేకపోయారన్నారు. పోటీ ప్రపంచంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. డీఆర్‌వో కే చంద్రశేఖరరావు, కేఆర్‌సీ కేఆర్ఆర్ సీఎస్‌డీసీ శ్రీదేవి, బందరు ఆర్డీవో స్వాతి, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్‌హేలా షారోన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి షాహిద్ బాబు, మెప్మా పీడీ సాయిబాబు, డీవైఈవో శేఖర్‌సింగ్ పాల్గొన్నారు.

39 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పంచాయతీల్లో గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేస్తున్న 39 మంది కార్యదర్శులకు గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు అందజేశారు. వీరితో పాటు కారుణ్య నియామకాలకు సంబంధించి ముగ్గురికి ఉద్యోగ నియామకపత్రాలను ఆయన అందజేశారు. డీపీవో జే అరుణ, డీపీవో కార్యాలయ ఏవో సీతారామయ్య పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం అందాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా, కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల రక్షణతోపాటు ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధకచట్టం - జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. అట్రాసిటీ కేసుల విచారణలో పురోగతి, బాధితులకు పరిహారం, క్షేత్రస్థాయిలో పౌరహక్కుల రక్షణకు తీసుకొంటున్న చర్యలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించేందుకు, కేసుల సత్వర విచారణలో అవరోధాలు ఎదురుకాకుండా చూడాలన్నారు. 2022, ఏప్రిల్ 4 నుంచి ఇప్పటి వరకు తిరువూరు డివిజన్‌లో 10 కేసుల్లో బాధితులకు రూ.10,75,000, విజయవాడ డివిజన్‌లో 150 కేసుల్లో బాధితులకు రూ.1,78,21,250, నందిగామ డివిజన్‌లో 56 కేసుల్లో బాధితులకు రూ.65 లక్షలు మేర మొత్తం 216 కేసుల్లో దాదాపు 2.54 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించామన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ 2023 డిసెంబరు 21 నుంచి 2024 డిసెంబరు 31 వరకు పశ్చిమ, దక్షిణ, ఉత్తర, మధ్య డివిజన్లతో పాటు నందిగామ, మైలవరం డివిజన్లు, మహిళా పీఎస్ పరిధిలో వేధింపుల నిరోధక చట్టానికి సంబంధించి 31 పెండింగ్ అండర్ ఇన్వెస్టిగేషన్, 30 పెండింగ్ ట్రయల్ కేసులు ఉన్నాయన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీసీపీ కేజీవీ సరిత, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీఓలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దాం

జిల్లా సమగ్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఉద్యోగులు, అధికారుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేసి ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంలో భాగస్వాములవుదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగర కార్యవర్గసభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా శాఖకు నిర్వహించిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడు వీవీ ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధిపథంలో అగ్రగామిగా నిలపడంలో ఉద్యోగుల సహకారం ఎంతో కీలకమైందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువచేయడంలో ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ సత్కరించి అభినందనలు తెలిపారు. బి.సతీష్‌కుమార్, డి.విశ్వనాథ్, జి.రామకృష్ణ, బీవీ రమణ, వి.నాగార్జున, కె.శివలీల, సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, ఎం.శ్రీనివాసరావు, కాశీం సాహెబ్, రాంబాబు, విజయశ్రీ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలి: లంకా

మచిలీపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలు జిల్లాలో అమలు జరుగుతున్న తీరుపై బుధవారం జడ్పీ సమావేశపు హాలులో కలెక్టర్ బాలాజీతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ పథకం, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం సక్రమంగా జరుగుతోందన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా పనులు జరుగుతున్నాయన్నారు. అమృత్ 2.0, గ్రామీణ సడక్‌యోజన, లక్‌పతిదీదీ, గరీబ్‌కల్యాణ్, పీఎం సూర్యఘర్‌ఘర్, టిడ్కోగృహాలు, పీఎం విశ్వకర్మయోజన, బందరుపోర్టు పథకాలతో జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఉపాధిహామీ పథకంలో జిల్లా ముందంజలో ఉందని, కలెక్టర్ బాలాజీ, ఇతరశాఖ అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర వేర్‌హౌసింగ్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో కే కన్నమనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర వేర్‌హౌసింగ్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు



డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతి కల్పించాలి

- డీఈవోకు యూటీఎఫ్ వినతి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హత గల సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లను తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని డీఈవో పీవీజే రామారావుకు బుధవారం యూటీఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలో సెకండరీ గ్రేడ్ టీచర్లను జాబితాల్లో చేర్చలేదన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పదోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎండీ షౌకత్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బీ కనకారావు, గౌరవాధ్యక్షుడు జే లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి ఎల్. నరేంద్ర కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

మహిళల సమస్యలపై గళం విప్పిన అభిజ్ఞ


ఎంయూఎన్ సదస్సులో ప్రసంగిస్తున్న అభిజ్ఞ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్స్(ఎంయూఎన్) సదస్సులో నగరానికి చెందిన ఇసుకమట్ల అభిజ్ఞ మహిళల వివక్షతపై మాట్లాడారు. అమెరికాలో బిజినెస్ ఫైనాన్స్ కోర్సు చేస్తున్న ఆమె..టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐపీసీ కరుణకుమార్ కుమార్తె. ప్రపంచవ్యాప్తంగా 3వేల మంది విద్యార్థినులు పాల్గొన్న ఎంయూఎన్ సదస్సులో ప్రసంగించారు. మహిళలపై వివక్షత, అసమానతలు, పలు సమస్యలపై మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి మహిళల హక్కుల పరిరక్షణ కోసం ఏ చర్యలు తీసుకోవాలో ఆమె వివరించారు.


భోగరాజు పట్టాభి సీతారామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజేష్ ఖన్నా, ఆర్ఎం కె.వెంకట్రావు తదితరులు

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

• యూనియన్ బ్యాంకు ఆర్ఎంను కోరిన ఆఫీసర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌ఖన్నా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకులో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అధికారులకు పని భారం తగ్గించాలని రీజనల్ మేనేజర్ వెంకట్రావును యూనియన్ బ్యాంకు ఆఫీసర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌ఖన్నా కోరారు. బుధవారం యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయాన్ని రాజేష్‌ఖన్నా సందర్శించారు. రీజనల్ మేనేజర్ వెంకట్రావుతో అధికారుల సమస్యలపై మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయండి


20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్‌ను బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర కోరారు. బుధవారం ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద దినకర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనం కలుగుతుందన్నారు. రుద్రవరంలో టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని కోరారు.

భారత రాజ్యాంగానికి ప్రత్యేక స్థానం


మాట్లాడుతున్న ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకరబాబు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రజాస్వామిక దేశాల్లో భారత రాజ్యాంగానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగం- ఒక సజీవపత్రం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సుధాకర్‌బాబు మాట్లాడారు. ఎల్ఐసీ డివిజన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జె. సుధాకర్, ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్, సంఘ నాయకులు పి.నాగయ్య, రజనీకాంత్, ఉమామహేశ్వరరావు, కె.బుల్లయ్య, ఏవీవీ ప్రసాద్, సన్నాల రఘు, ఉదయలక్ష్మి, వై.స్వామినాథ్ పాల్గొన్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

సీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం

చల్లపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనాయకుడు చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) జీవితం నేటి తరానికి ఆదర్శమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, సీఆర్ ట్రస్ట్ కోశాధికారి హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సీఆర్ 31వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. సంపన్న కుటుంబంలో పుట్టి పార్టీకోసం, ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన ఆదర్శ కమ్యూనిస్టు రాజేశ్వరరావు జీవితం నేటితరం రాజకీయ నేతలకు ఆదర్శమన్నారు. చల్లపల్లి జమిందారీ వ్యతిరేక భూపోరాటాలను ముందుండి నడిపి వేలాది ఎకరాలు పేదప్రజలకు పంపిణీచేసిన ఘనత రాజేశ్వరరావుదన్నారు. మంగళాపురంలో ప్రారంభమైన పోరాట ఉద్యమం దేశవ్యాపితంగా భూపోరాటాలను ప్రభావితం చేసిందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, మేకా నరసింహారావు, కంఠంనేని జ్యోత్స్నాదేవి, అట్లూరి వెంకటేశ్వరరావు, చంద్ర సుబ్బారావు, మాలెంపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వారం పాటు తాగునీరు విడుదల

నాగాయలంక, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నాగాయలంక సౌత్ చానల్, సెంట్రల్ చానల్‌కు వారం రోజులపాటు తాగునీరు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ మండల అధికారి పి.రవితేజ తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాల చెరువులను, ఊర చెరువులను పంచాయతీ నిధులతో నింపుకోవాలని కార్యదర్శులను ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ ఆదేశించారు. వేసవిలో ప్రజలకు తాగునీరు కొరత లేకుండా, మూగజీవాలకు నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. తాగునీరు కోసం విడుదల చేసిన నీటిని, ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నాగాయలంకలోని రక్షిత మంచినీటి చెరువును నింపేందుకు పారిశుధ్య సిబ్బందితో అధికారులు శుభ్రం చేయిస్తున్నారు.

పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలి


పోషణ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి

చల్లపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదిలక్ష్మి సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి మోడల్ అంగన్వాడీ కేంద్రం, లక్ష్మీపురం సచివాలయం-3 పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధాన

పెడన, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామాలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వేలాది భక్తులు పాల్గొన్నారు. సంఘం నాయకులు పోతార్లంక నాగేశ్వరరావు, కూరేటి ఈశ్వరరావు, పోతార్లంక నాని పర్యవేక్షించారు.

జాతీయ రహదారిపై అంధకారం

• రాత్రివేళ హైవేపై వెలగని లైట్లు
• చీకటిమయంగా చల్లపల్లి, లక్ష్మీపురం జంక్షన్లు


లక్ష్మీపురం జంక్షన్ వద్ద వెలగని హైవే ఫోకస్ లైట్లు


చల్లపల్లి - పెదకళ్లేపల్లి రోడ్డులో హైవేపై వెలగని విద్యుద్దీపాలు, వాహనాల వెలుతురులో లక్ష్మీపురం జంక్షన్

(ఆంధ్రజ్యోతి - చల్లపల్లి)

చల్లపల్లి మండల పరిధిలో 216ఏ జాతీయ రహదారిపై విద్యుద్దీపాలు లేకపోవడంతో చీకటిమయంగా ఉంటోంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. హైవేమీదుగా గ్రామాలకు వెళ్లే చోట్ల, హైవేపైన కొన్నిచోట్ల విద్యుద్దీపాలు లేవు. లైట్లు ఉన్నచోట కూడా వాటిని వేయకపోవటంతో హైవే అంధకారంగా ఉంటోంది. జాతీయ రహదారిపై లక్ష్మీపురం ఎస్టీకాలనీ సమీపంలో ఉన్న జంక్షన్ ప్రధానమైనది. హైవే మీదుగా లక్ష్మీపురం గ్రామంలోకి వెళ్లకుండా భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు నేరుగా కాసానగర్ మీదుగా మోపిదేవి, అవనిగడ్డ వెళ్లిపోవచ్చు. లక్ష్మీపురం గ్రామంలోకి శివారు గ్రామాలకు వెళ్లేవారు డౌన్‌లోకి దిగి ఆర్అండ్‌బీ రోడ్డుమీదుగా వెళతారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న జంక్షన్‌లో తాటిచెట్టు ఎత్తున లైట్లు ఏర్పాటుచేసినా అవి వెలగడం లేదు. నిర్వహణ లోపమో, మరే కారణమో తెలియదు. లక్ష్మీపురం నుంచి మంగళాపురం, రామానగరం నుంచి నూకలవారిపాలెం, చల్లపల్లి పద్మావతి ఆస్పత్రి బజారు మీదుగా గంగులవారిపాలెం దళితవాడ, పెదకళ్లేపల్లి రోడ్డుమీదుగా వెంకటాపురం పెదకళ్లేపల్లి గ్రామాలకు జడ్పీ రహదారుల్లో ప్రయాణం చేస్తూ హైవే ఎక్కివెళ్లాలి. ఆయా రోడ్ల వద్ద హైవేపై లైట్లు వెలగడం లేదు.

తరచూ ప్రమాదాలు

లక్ష్మీపురం జంక్షన్ ఎంత ప్రధానమైనదో చల్లపల్లి-పెదకళ్లేపల్లి రోడ్డు జంక్షన్ అంతే ప్రధానమైనది. ఫ్యాక్టరీలు, మిల్లులతోపాటు పలు గ్రామాలకు ఈ మార్గంలోనే ప్రయాణించాలి. లైట్లు వెలగకపోవటంతో వాహనాల లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, రేడియం స్టిక్కర్లు, వైట్ పెయింట్ల ఆధారంగా వాహనదారులు ముందుకు వెళుతున్నారు. సరైన కాంతి లేక తరచూ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. గంగులవారిపాలేనికి వెళ్లే దారిలో హైవేపై స్వచ్ఛ చల్లపల్లి వారు గ్లోసైన్ బోర్డులు ఏర్పాటుచేసి ఫోకస్ లైట్లు పెట్టారు. అక్కడ సమస్య లేదు. మిగిలిన ప్రాంతాల్లో హైవే లైట్లు వెలగక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి హైవేపై లైట్లు వెలిగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పెదప్రోలు ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి ఉంది.


కోనేరుసెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గ్యాస్ సిలిండర్లపై పెంచిన రూ.50 తగ్గించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేయాలని, వంట గ్యాస్ సిలిండర్లపై పెంచిన రూ.50 తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం కోనేరుసెంటర్‌లో వారు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్, ఎండీ యూనస్, ఎస్.ధనుంజయరావు, ఐద్వా అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట నుంచి బస్టాండ్ వరకు సీపీఐ ప్రదర్శన..

పెడన: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. కొత్తపేట నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. సీపీఐ నాయకులు కె.వి.వి.ప్రసాద్, నార్ల వెంకటేశ్వరరావు, కట్టా హేమసుందరరావు, అడ్డాడ ప్రసాద్, పేరిశెట్టి ఉమాకాంతం, తుమ్మా చినకొండయ్య, బూసం బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పాండురంగస్వామి దేవాలయంలో గోశాల ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న చలమలశెట్టి నరసింహారావు తదితరులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిలకలపూడిలోని పాండురంగ స్వామి దేవాలయంలో గోసంరక్షణార్థం నిర్మించిన గోశాలను బుధవారం ప్రారంభించారు. ఆలయ నిర్వాహకుడు టీకే నరసింహం గోపూజ నిర్వహించారు. భక్తులు తోట నరేష్‌బాబు, నూకల దుర్గాశాంతి, నూకల ఆదర్శ నిర్మించిన ఈ గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల బస్సు వేళల్లో మార్పులు

అవనిగడ్డ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నుంచి ద్వారకా తిరుమల వెళ్లే బస్సు వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బయలుదేరే సర్వీసు 11 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. నాగాయలంక-నరసాపురం సర్వీసు గురువారం నుంచి మచిలీపట్నం, కృత్తివెన్ను, పల్లెపాలెం, లోసరి, భీమవరం మీదుగా నరసాపురం వెళ్లి తిరిగి అదే మార్గంలో మధ్యాహ్నం 1 గంటకు తిరిగి బయలుదేరుతుందని డీఎం తెలిపారు.

నిర్దేశిత రుసుమే వసూలు చేయాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నగరం, మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం నిర్దేశించిన దరఖాస్తు రుసుమును మాత్రమే అర్జీదారుల నుంచి వసూలు చేయాలని సిబ్బందిని నార్త్ మండల తహసీల్దార్ నాగభూషణం ఆదేశించారు. రుసుము వివరాల పట్టికను నోటీసు బోర్డుల్లో ఉంచాలన్నారు. అదనంగా రుసుము వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘంటసాల/మోపిదేవి: ప్రభుత్వం సచివాలయాలు, మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే వివిధ రకాల సేవలకు నిర్దేశించిన రుసుమే వసూలు చేయాలని ఘంటసాల తహసీల్దార్ బి.వి జయప్రసాద్, మోపిదేవి తహసీల్దార్ ఎం.శ్రీవిద్య ఆదేశించారు. అదనంగా ఎక్కువ వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామచంద్రరావు కుటుంబసభ్యులకు పరామర్శ


వేమూరి రామచంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఘంటసాల డాట్ నెట్ నిర్వాహకుడు రచయిత వేమూరి రాజేష్ తండ్రి రామచంద్రరావు(బంగారయ్య) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వేమూరి రాజేష్‌ను, కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూటమి నాయకులతో కలిసి పరామర్శించారు. తుమ్మల చౌదరిబాబు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు పాల్గొన్నారు.

దింటిమెరకలో వేములపల్లి కుటుంబసభ్యులకు..

కోడూరు: కోడూరు శివారు దింటిమెరక గ్రామానికి చెందిన వేములపల్లి సుబ్బారావు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. కొద్ది రోజులు క్రితం సుబ్బారావు మృతి చెందారు.

కోడూరు-అవనిగడ్డ రహదారి పనులు వేగవంతం

కోడూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు ఆర్ అండ్ బీ డీఈ రమేష్ తెలిపారు. బుధవారం మాచవరం గ్రామం వద్ద నుంచి కొత్తపేట వైపునకు తారు లేయర్ పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో ఎప్పటికప్పుడు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీవో మరియదేవి తెలిపారు. 1040 దరఖాస్తులు వచ్చాయని, అవనిగడ్డలోని ఏడీబీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మండలానికి 107 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు.

పెదపాలెం యూపీ పాఠశాల వార్షికోత్సవం

నాగాయలంక, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెదపాలెం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బహుమతులను అందజేశారు. సర్పంచ్ దున్నా రాజేష్, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, చీలి నాగబాబు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

చల్లపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మంగళాపురంలో సోమవారం నుంచి కనిపించకుండా పోయిన యువకుడు కైతేపల్లి సతీష్ ఆచూకీ లభ్యమైంది. యజమాని చంద్ర చిన్నబాబు వద్ద పని మానివేయాలనే ఆలోచనతో, రెండు రోజులు లేకుంటే వేరే పనివాళ్లను పనిలో పెట్టుకుంటారని భావించి కనిపించకుండా దాక్కున్నట్లు పోలీసులకు సతీష్ తెలిపాడు. యజమాని ఇంటిపక్కనే మరోఇంటి డాబాపై ఎవరికీ కనిపించకుండా నిద్రించానని, చెట్టుకు ఉన్న పండ్లు కోసుకుని తిని మంగళవారం అర్ధరాత్రి బయటకువచ్చి ఇంటికి వెళ్లానని చెప్పాడు. సతీష్ బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చాడని ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మట్టి నమూనాల సేకరణ

పెడన రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ విధిగా వ్యవసాయ క్షేత్రాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నూరున్నీసా అన్నారు. బల్లిపర్రులో రైతులతో కలిసి పొలాల్లో ఆమె మట్టి నమూనాలను సేకరించారు. ఇప్పటి వరకు మండలంలోని 18 వ్యవసాయ రైతుసేవా కేంద్రాల ద్వారా 1,172 మట్టి నమూనాలు సేకరించామన్నారు. జూన్ నాటికి మట్టి పరీక్షల ఫలితాలను అందిస్తామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అవనిగడ్డ రూరల్/అవనిగడ్డ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రేవులో మోదుమూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందిన దుర్ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను వెంకట్రామ్, పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ వేర్వేరుగా పరామర్శించారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని పూజలు

కోడూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో గాయపడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండవీటి సునీత, కోట రాంబాబు, కాగిత రామారావు, పూతబోయిన సాయిబాబు, సిద్దినేని అశోక్ నాయుడు, పూతబోయిని కరుణకుమార్, బచ్చు వెంకటేష్, తోట సోమశేఖరరావు పాల్గొన్నారు.

కూలిన కొబ్బరి చెట్టు..విద్యుత్‌కు అంతరాయం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గొడుగుపేటలో బుధవారం తెల్లవారుజామున నాగార్జున స్కూల్ వద్ద ఒక కొబ్బరిచెట్టు ఆకస్మాత్తుగా కూలిపోయింది. విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగిపోయాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. వేసవి కావడంతో విద్యుత్ లేకపోవ డంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

అవనిగడ్డ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగాధిపతి డీఎం రత్నకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుల్లటి మజ్జిగ మిశ్రమంతో
పంటల్లో తెగుళ్ల నివారణ

మోపిదేవి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివిధ పంటల్లో ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ మిశ్రమం ఎంతగానో దోహదపడుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ అపర్ణ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుల్లటి మజ్జిగ మిశ్రమాన్ని తయారు చేసే విధానాన్ని ప్రదర్శనాపూర్వకంగా రైతులకు వివరించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, స్త్రీలు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రైతులు, గ్రామస్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

భోజనశాల నిర్మాణానికి ఆర్థిక సాయం

కూచిపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మొవ్వ జెడ్పీపాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ తాతినేని గోపాలరావు అందించిన రూ.50 లక్షల ఆర్థిక సహకారంతో పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాలరావు - బీనాదేవి దంపతులు నిర్మాణ భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీదేవి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గురువిందపల్లి బాబురావు, పాఠశాల విద్యాకుటుంబం భోజనశాల నిర్మాణ దాతలకు అభినందనలు తెలిపారు. తాతినేని శరత్ కుమార్ పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న డాక్టర్ గోపాలరావు దంపతులు


దేవరపల్లి కోటిని అభినందిస్తున్న సంఘ సభ్యులు

నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడిగా దేవరపల్లి

గుడివాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఐక్యతకు, బలోపేతానికి కృషి చేసిన దేవరపల్లి కోటినే తిరిగి శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం గుడివాడ డివిజన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని మాజీ అధ్యక్షులు వికృతి పోతురాజు అన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీదేవరకొండ నాగన్న సత్రంలో గుడివాడ డివిజన్ స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి చీర్ల దుర్గారావు, కోశాధికారిగా వికృతి సత్యం, గౌరవ అధ్యక్షునిగా వికృతి పోతురాజు, సలహాదారునిగా కొల్లి రాఘవయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట పాణేశ్వరరావు, మణేశ్వరరావు, కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, రాఘవయ్య, సత్యనారాయణలతో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సత్కరించారు.

ఎంఆర్ఐగా బాధ్యతల స్వీకరణ

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు తహశీల్దారు కార్యాలయంలో ఎంఆర్ఐగా జి.హనుమంతరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నందివాడ నుంచి బదిలీపై ఆయన గుడ్లవల్లేరుకు వచ్చారు.

పిల్లర్లకే పరిమితమా..!

● తుప్పుపట్టి పాడైపోతున్న పిల్లర్ల ఇనుపచువ్వలు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : హనుమంతపురంలో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు పిల్లర్లకే పరిమితమై అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా పొదలు, పిచ్చిమొక్కలు మొలచి చిట్టడవిగా తయారైంది. గత వైసీపీ హయాంలో గ్రామంలో రైతుభరోసా కేంద్రం, పక్కనే వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలకు అట్టహాసంగా ప్రారంభించారు. అయితే నిధుల లేమితో నిర్మాణపు పనులను మధ్యలోనే ఆపేశారు. రెండడుగుల మేర కాంక్రీట్ పిల్లర్లు వేసి వదిలేయడంతో పిల్లర్ల ఇనుపచువ్వలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి పాడైపోతున్నాయి. దీనికితోడు పిల్లర్ లోపల ఇనుపచువ్వలకు పిచ్చికాడ అలుముకుని తుప్పుపట్టి పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రెండుభవనాల నిర్మాణపు పనులు నిలిచిపోవడంతో ఆ ప్రదేశం పొదలు, పిచ్చిమొక్కలతో నిండి, పాములు, విషపురుగులకు నిలయాలుగా మారింది. దీంతో ఎప్పుడు ఏప్రమాదం భారీన పడాల్సి వస్తోందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం రైతుసేవా కేంద్రం తాత్కాలికంగా కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ అడ్రస్సే లేకుండా పోయిందని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణపు పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.


పిల్లర్ల ఇనుపచువ్వల చుట్టూ పెరుగుతున్న పిచ్చికాడ


పిచ్చిమొక్కలతో దండకారణ్యంలా కనిపిస్తున్న రైతుసేవా కేంద్రం

పాములు, విషపురుగులకు నిలయంగా ఉంది



సంవత్సరాల తరబడి భవనాల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఆప్రాంతమంతా పొదలు, పిచ్చికంప పెరిగి చిట్టడవిలా తయారైంది. దీంతో పాములకు, విషపురుగులకు నిలయంగా మారింది. దీంతో పిల్లలు భయటకు వెళ్లాలంటే భయపడి పోతున్నారు.

గుర్విందపల్లి నానీబాబు, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



నివాస గృహాల నడుమ రైతు సేవాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణపనులు నిలిచిపోవడంతో పిచ్చిమొక్కలతో ఇబ్బంది పడుతున్నాము.ప్రభుత్వం మారినా పనులు ప్రారంభించలేదు. పిల్లర్లకు పిచ్చికాడ పెరిగి ఇనుపచువ్వలు తుప్పుపట్టాయి. అటుగా వెళ్లేందుకు భయపడి పోతున్నాము.

జి. సురేష్, స్థానికుడు


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా సీతారామస్వామి రథోత్సవం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మోటూరులోని సీతారామస్వామి రథోత్సవాన్ని బుధవారం ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ప్రాతఃకాల నిత్యహోమాలు, గ్రామ బలిహరణ వంటి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం రథోత్సవాన్ని మోటూరు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ గొరిపర్తి నాగ మౌనిక, నల్లాన్ చక్రవర్తుల వంశస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

వృద్ధులు , అనాథ పిల్లల సంరక్షణే ధ్యేయం

పెదపారుపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు , అనాథ పిల్లలు, ఒంటరి మహిళల పరిరక్షణే ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపారుపూడిలోని విజయవాడ రోడ్డులో హల్లెలూయ మినిస్ట్రీస్ వారు నిర్వహిస్తున్న హ్యాపీ హోమ్ పక్కనే పిల్లలు, ఒంటరి మహిళల కోసం నూతనంగా షెల్టర్ హోం వసతి గృహాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే హ్యాపీ హోమ్‌లో 25 మంది వృద్ధులు ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చప్పిడి కిషోర్, దగాని లెనిన్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో అరటి, మొక్కజొన్నలకు నష్టం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు లంకల్లో మంగళవారం రాత్రి సంభవించిన బలమైన గాలులకు అరటి తోటలు, మొక్కజొన్న తోటలు దెబ్బతిన్నాయి. గెలలతో ఉన్న అరటి చెట్లు విరిగిపడటంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు కరీముల్ల, వీరంకి రమేష్ తెలిపారు. మూడెకరాల అరటితోట పడిపోయి లక్షల్లో నష్టం జరిగిందని రమేష్ చెప్పారు. మొక్కజొన్న తోటలు గాలికి నేలకు అతుక్కుపోయాయన్నారు. పంట నష్టాలను నమోదు చేసి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి సహకారం తప్పనిసరి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అందరి సమష్టి సహకారం తప్పనిసరని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.38 లక్షల నిధులతో చేపట్టనున్న షాపింగ్ కాంప్లెక్స్, డ్రెయినేజీ నిర్మాణాలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలసి బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తానాసంస్థ సహకారంతో సంస్థ ప్రతినిధి యార్లగడ్డ మధు ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల పవర్ స్ప్రేయర్లను పది మంది రైతులకు అందజేశారు.

స్వచ్ఛాంధ్ర గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ డీకే.బాలాజీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ సిబ్బందికి అందించాలని తెలిపారు. గ్రామపంచాయతీ సొంత నిధులతో డ్రెయినేజీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడం ఎంతైనా అభినందనీయమన్నారు. గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతీ, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, ఎండీవో జె.విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రమణరావు, ఈఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


డ్రెయినేజీ శంకుస్థాపనలో పాల్గొన్న కలెక్టర్ డీకే.బాలాజీ

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : రేపాని

గుడివాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండ డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. సంక్షేమబోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 24వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నవ నిర్మాణ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు దాసు శ్యామ్‌ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు రాజులపాటి బాబీ, కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కోరం రాజు, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ ఉపాధ్యక్షులు బండి శ్రీను, నాయకులు తురక ఏసు, గాంధీ, అంజి, శ్రీను, చిన్ని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రేపాని కొండ

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో

పామర్రు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం కలుగుతుందని పామర్రు సీడీపీవో సి.భానుశ్రీ అన్నారు. స్థానిక ఎన్టీఆర్‌కాలనీలో గర్భిణులకు, బాలింతలకు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశ వర్కర్లకు పోషణ్ పక్వాడ్‌పై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్ర పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేల చైతన్యవంతుల్ని చేసే బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లపై ఉందన్నారు. గర్భిణులకు ఎత్తు, బరువులు చూడడము, రక్తహీనత కలిగిన వారిని గుర్తించి , వాళ్లకు అవసరమైన ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు అందించాలన్నారు. మాతాశిశు మరణాలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతుందని, ప్రభుత్వ లక్ష్యసాధనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహకురాలు కెరత్నశ్రీ, బి.పద్మజ, ఎస్. ప్రేమ్‌కిరణ్, వైద్యఆరోగ్యసిబ్బంది, పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సి.భానుశ్రీ

పెదపారుపూడి: చింతల దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు ఎం.శివనాగమణి , అరుణ కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీగా నమోదైనప్పటి నుంచి బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు సుగాలిపేట అంగన్వాడీ కేంద్రం వద్ద బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాలనే బిడ్డకు ఇవ్వాలని, ముర్రుపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని అందిస్తాయని ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి. కోకిలారాణి, వి.విజయకుమారి, జె. భాగ్యం, జి. సలోమి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చంద్రాలలో విద్యుత్ నూతన లైన్ల ఏర్పాటు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

రైల్వేగేటును విస్తరించాలి

గుడివాడ : కేటీఆర్ కళాశాల రోడ్డులోని రైల్వేగేటును విస్తరణ చేయాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి. మురళీకృష్ణ తెలిపారు. కేటీఆర్ కళాశాలలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. సభ్యులు మహ్మమద్ తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిగుట్టలను తొలగించాలి

గుడివాడ : ముదినేపల్లి రోడ్డులోని పెద్దకాలువ వంతెన వద్ద నుంచి నటరాజ్ రైస్‌మిల్ వరకు రహదారి పక్కన ఉన్న మట్టిగుట్టలను వెంటనే తొలగించాలని మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు కోరారు. వాహనాలు ఒకరిని మరోకరు దాటే క్రమంలో మట్టిగుట్టలపైకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.


లారీ ఢీ కొనడంతో తెగిన 33/11 కేవీ విద్యుత్ తీగలు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు కరకట్ట ర్యాంపులో బుధవారం టిప్పర్ లారీ 33/11కేవీ విద్యుత్ లైన్‌ను ఢీకొట్టింది. కరకట్ట ప్రక్కన ర్యాంపులో చెట్టుకింద హైడ్రాలిక్ వేసి ఉన్న టిప్పర్ లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా హైడ్రాలిక్ దించకుండా కరకట్టపైకి రావటంతో 33/11కేవీ విద్యుత్ లైన్ తీగలు ట్రక్కుకి తగిలాయి. దీంతో కరెంటు స్తంభం విరిగి విద్యుత్ తీగలు ట్రక్కుపై పడింది. ఈక్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే మండల విద్యుత్ ఏఈ దేవదాసు సిబ్బందితో వచ్చి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్‌ని పునరుద్ధరించారు. రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో ఈదురు గాడ్పులకు కూలిన కరెంటు స్తంభాన్ని తొలగించి , విద్యుత్‌శాఖ సిబ్బంది కొత్తస్తంభాన్ని ఏర్పాటు చేశారు.

గీతామందిరానికి గోదానం

పమిడిముక్కల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురంలో శ్రీమద్భగవత్ గీతామందిరానికి చెందిన శ్రీకృష్ణ భక్త మహిళా మండలి ఆధ్వర్యంలో సినీ దర్శకుడు తాతినేని ప్రకాశరావు కుమార్తె చింతపల్లి లీల సహకారంతో రూ. 40వేలు విలువచేసే ఒంగోలు జాతి ఆవు, దూడలను గీతామందిర్ పూజారి వేదాంతం రాముకు బుధవారం అందజేశారు. దీంతోపాటుగా పశుగ్రాసం నిమిత్తం సంవత్సరానికి రూ. 10వేల నగదును అందజేస్తామన్నారు. అనంతరం పూజారిని నూతన వస్త్రాలతో సత్కరించారు. గీతా పారాయణం, విష్ణుసహస్రనామం పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త మూల్పూరి గోవింద ప్రభాకరరావు, లయన్స్‌క్లబ్ సెక్రటరీ తుమ్మల వెంకట గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ గ్రాండ్ టెస్టులో త్రివేణి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8వ తేదీన చుక్కా రామయ్య ఐఐటీ గ్రాండ్ టెస్టులో స్థానిక త్రివేణి ఇంగ్లీషు మీడియం పాఠశాల 6,7 తరగుతుల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక త్రివేణి పాఠశాల ఐఐటీ టెస్టులో బహుమతులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాండ్ టెస్టులో 6వ తరగతిలో ఒకరికి ప్రథమ బహుమతి, ఐదుగురికి ద్వితీయ బహుమతులు, నలుగురు విద్యార్థులకు తృతీయ బహుమతి సాధించారన్నారు. 7వ తరగతిలో ఐదుగురికి ప్రథమ బహుమతి, నలుగురు విద్యార్థులకు ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. ఏ విభాగంలో పోటీలు జరిగిన తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానాలను సాధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి డైరెక్టర్ శివశంకర్

ప్రభుత్వం నిర్దేశించిన రుసుమునే చెల్లించాలి

● ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వుల మేరకు డివిజన్ పరిధిలోని వారసత్వం/కొనుగోలు/గిఫ్ట్/పార్టిషన్ డీడ్ ద్వారా పొందిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన రుసుమును మాత్రమే చెల్లించాలని గుడివాడ రెవిన్యూ డివిజనల్ అధికారి జి.బాలసుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యుటేషన్ , పాస్ పుస్తకానికి రూ.150లు, భూమి కొలతకు(ఎఫ్ లైన్) దరఖాస్తుకు రూ.550లు రాష్ట్రప్రభుత్వం నిర్ధేశించిన ధరలని పేర్కొన్నారు. మీ-సేవా సెంటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల్లో పేర్కొన్న విధంగా ఛార్జీలకు మించి అధిక ధరలను వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ఎక్కువ ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గానీ, ఆర్‌డీవో కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

నందివాడ: రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకునేందుకు మీ సేవ సెంటర్లలో లేదా గ్రామ సచివాలయములలోగానీ ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించొద్దని తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం మండల గ్రామ ప్రజలకు వారసత్వము, కొనుగోలు లేదా గిఫ్ట్‌గా పొందిన భూములకు ఆన్‌లైన్ నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం వారు నిర్దేశించిన రుసుములు మ్యుటేషన్ , పాస్ పుస్తకములకు రూ.150లు, భూమి కొలతకు అనగా యాప్ ఆన్‌లైన్ దరఖాస్తుకు రూ.550 మాత్రమే చెల్లించాలన్నారు.

పమిడిముక్కల : రెవెన్యూశాఖ సేవలను గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి అర్జీదాఖలు చేసి పొందవచ్చని పమిడిముక్కల తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. సచివాలయాలు, మీసేవలో చెల్లించిన రుసుముకు రశీదు తప్పక అడిగి తీసుకోవాలన్నారు. రశీదులో చూపిన మొత్తం కంటే అధికంగా చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.50, జనన, మరణ ధ్రువీకరణ నమోదు పత్రానికి రూ. 35 చొప్పున చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్‌బుక్ మార్పుకు రూ. 150, 22(ఏ)నుంచి తొలగింపునకు అర్జీ రూ. 50, ఎఫ్‌లైన్, పట్టా సబ్‌డివిజన్ కోసం రూ. 550, ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్‌కు రూ. 50, పొజిషన్ సర్టిఫికెట్ రూ.50, ప్రభుత్వ భూముల ఆక్రమణల రెగ్యులరైజేషన్‌కు రూ.40 చెల్లించి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

తోట్లవల్లూరు : గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూసేవలకు అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి బుధవారం హెచ్చరించారు. కుల ధ్రువీకరణ పత్రానికి, ఎన్‌వోసీ, ఈబీసీ సర్టిఫికెట్లకు రూ. 50, జనన, మరణ నమోదుకు రూ 35, పట్టాదారు పాసుపుస్తకానికి రూ 150, అడంగల్లో మార్పులకు రూ.50, పట్టాదారు పాసుపుస్తకం రీ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల రెగ్యులజేషన్‌కు రూ. 40 చొప్పున మాత్రమే రుసుము వసూలు చేయాలన్నారు. ఇంతకంటే ఎక్కువ వసూలు చేస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకు రావాలని తహసీల్దార్ కుసుమకుమారి కోరారు. ప్రజలు తాముచెల్లించే రుసుమునకు తప్పనిసరిగా, రశీదును సంబంధిత అధికారులను అడిగి తీసుకోవాలని సూచించారు.